క్లుప్తంగా

సబ్ జైలు తనిఖీ



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి మానిపాటి శ్రీధర్

హిందూపురం అర్బన్: పట్టణంలోని సబ్ జైలును స్థానిక సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్ శనివారం తనిఖీ చేశారు. కారాగార రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా జడ్జి ఖైదీలతో మట్లాడుతూ జైలు జీవితం అనుభవించడం వల్ల కుటుంబాల గౌరవ, మర్యాదలు దెబ్బతింటాయన్నారు. న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని స్థితిలో ఉన్న వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. అనంతరం ఏఏ నేరాల్లో జైలుకు వచ్చారు? న్యాయవాదులను పెట్టుకున్నారా? ఎప్పటి నుంచి జైలులో ఉంటున్నారు అన్న విషయాలు అడిగి తెలుసుకున్నారు. న్యాయమూర్తి వెంట జైలర్ హనుమన్న, న్యాయవాదులు కళావతి, సంతోషికుమారి, అబ్దుల్లా, భరత సింహ, లోక్ అదాలత్ సిబ్బంది శారద లు పాల్గొన్నారు.

రీ సర్వే పనుల ప్రారంభం



మాట్లాడుతున్న తహసీల్దారు హసీనా సుల్తానా

పరిగి: మండలంలోని పి.నరసాపురం పంచాయతీ ఎస్.బీరేపల్లిలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో రెండో విడత రీసర్వే పనులు శనివారం ప్రారంభమయ్యాయి. తహసీల్దారు హసీనాసుల్తానా ఆధ్వర్యంలో గ్రామంలోని రైతుల వివరాలను సేకరించిన అనంతరం పొలం విస్తీర్ణం, సరిహద్దులపై సర్వే పనులు ప్రారంభించారు. తహసీల్దారు మాట్లాడుతూ రీ సర్వేతో భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ శోభ, ఆర్‌ఐ సిద్దేశ్వర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: వేసవిలో ఆరోగ్యం పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ ఆదిత్య కుమార్ సూచించారు. శ్రీక్షేత్రం కైవరం తాతయ్య యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం టీటీడీ కళ్యాణ మండపంలో బెంగళూరు ఎంఎస్ రామయ్య మెడికల్ కాలేజీ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 430 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు. మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్, యోగి నారాయణ సేవా సమితి ప్రెసిడెంట్ రవిశంకర్, సభ్యులు పాల్గొన్నారు.

వీఎస్ఎస్ఎన్ సంఘం అధ్యక్షుడిగా నాగరాజు



నూతన అధ్యక్ష ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని కేటి హళ్లి గ్రామం వీఎస్ఎస్ఎన్ సంఘం అధ్యక్షుడిగా జేడీఎస్ మద్దతుదారుడు కేఎల్ నాగరాజు మూడోసారి ఎన్నికయ్యారు, అదే విధంగా ఉపాధ్యక్షుడిగా జేడీఎస్ మద్దతుదారుడు భీమణ్ణ సైతం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక వీఎస్ఎస్ఎన్ సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఎన్నికల్లో వారిద్దరే నామినేషన్ పత్రాలు దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి టీఆర్ రాఘవేంద్ర ధ్రువీకరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప మాట్లాడుతూ.. సహకార సంఘం అభివృద్ధికి నూతన అధ్యక్ష ఉపాధ్యక్షులు, డైరెక్టర్లు కలసి కట్టుగా కృషి చేయాలని సూచించారు. సహకార సంఘానికి మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు తదితర గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

కర్ణాటక బంద్ విజయవంతం



ర్యాలీ నిర్వహిస్తున్న కన్నడ అభిమానులు

పావగడ: మహారాష్ట్ర, బెళగావి ప్రాంతాల్లో కన్నడిగులపై మరాఠీలు చేస్తున్న దౌర్జన్యాలు, ఆకతాయి చేష్టలను వ్యతిరేకిస్తూ శనివారం వైఎన్ హొసకోటలో నిర్వహించిన కర్ణాటక బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా స్థానిక కన్నడ కళ, సాంస్కృతిక మండలి తదితర సంఘాలు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. మండలి అధ్యక్షుడు ఏటి నాగరాజు మాట్లాడుతూ.. మహారాష్ట్ర, బెళగావి గడి ప్రాంతాల్లో కన్నడిగుల పైన మరాఠీల దౌర్జన్యం మితిమీరి పోతోందన్నారు. ఇలాగే కొనసాగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆందోళనకారుడు జీబీ సత్యనారాయణ మాట్లాడుతూ.. గతంలో కేఎస్ఆర్టీసీ కార్మికులపై మరాఠీలు దాడి చేశారని.. అప్పుడే వారికి తగిన గుణపాఠం చెప్పి ఉంటే బాగుండేదని తెలిపారు.

హంద్రీ-నీవా ఉన్నా.. ప్రయోజనం సున్నా!



హంద్రీనీవా కాలువలో నీరు పారుతున్న దృశ్యం



పంటలు సాగు చేసిన రైతులు

- చెరువులకు నీరు రాకపోవడంతో రైతుల ఆందోళన
- వరి పంట నష్టపోయే అవకాశం..

సోమందేపల్లి: మండల కేంద్రంలోని హంద్రీ-నీవా కాలువలో నీరు పారుతున్నా చెరువుకు నీరు విడుదల చేయడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో పంటలు ఎండిపోయే పరిస్థితి వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మంత్రి సవిత చెరువులకు నీరు ఇస్తామని హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రమైన సోమందేపల్లి చెరువు ఆయకట్టు కింద దాదాపు 370 ఎకరాల్లో రైతులు పంటలు పెడుతున్నారు. ప్రధానంగా వరి పంట సాగు చేస్తున్నారు. బోర్లలో నీరు లేకపోగా చెరువులో ఉన్న నీరు ఖాళీ అవుతున్నాయి. దీంతో తమ పరిస్థితి ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి సోమందేపల్లికి హంద్రీ-నీవా కాలువకు నీటిని విడుదల చేశారు. కానీ పక్కనే కాలువలో నీరు పారుతున్నా చెరువుకు మాత్రం సాగునీటిని విడుదల చేయటం లేదని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం కనీసం రైతు భరోసా డబ్బులు ఇవ్వకపోగా సొంత ఖర్చులతో అప్పులు చేసి పంటలు పెట్టామని, వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో పంటలు ఎండుముఖం పట్టే అవకాశాలున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రైతులు బాగోగులు చూడటంలో విఫలం అయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి సాగు నీటిని విడుదల చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

నియోజకవర్గంలో వివరాలు ఇలా

మండలం	చెరువులు
పెనుకొండ	23
సోమందేపల్లి	44
రొద్దం	30
పరిగి	17
గోరంట్ల	93

మాటలకే మంత్రి పరిమితం



నియోజకవర్గంలో మంత్రి సవిత ఉన్నప్పటికీ ప్రజా సమస్యలు పట్టవు. హంద్రీ-నీవా కాలువలో నీరు పారుతున్నా కనీసం చెరువుకు నీటిని విడుదల చేయటం లేదు. ఇలాగైతే రైతులు నష్టపోతారు. చెరువులు నింపుతామన్న హామీని నిలబెట్టుకోవాలి. నమ్మి ఓట్లు వేసిన రైతులను కూటమి ప్రభుత్వం విస్మరిస్తోంది.

– గోవిందమ్మ గారి శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు

రైతులు నష్టపోతారు



వందల ఎకరాల్లో రైతులు పంటలు పెట్టారు. సాగునీరు లేక పోతే పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. కాలువలో నీరు పోతుండగా చెరువుకు ఎందుకు ఇవ్వడం లేదు. బోర్లలో నీరు తగ్గి పోతున్నాయి. రైతులపట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే ప్రభుత్వం నీటిని విడుదల చేయాలి

– నాగరాజు, రైతు, గోరంట్ల

పిల్లల ప్రవర్తనపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

పెనుకొండ రూరల్: చిన్న పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, మహిళా పోలీసులకు శిశు సంక్షేమ శాఖ, మిషన్ వాత్సల్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ సినిమాలు, సెల్‌ఫోన్ చిన్న పిల్లలను తొందరగా ప్రభావితం చేస్తాయన్నారు. సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్ ప్రభావం పిల్లలపై పడకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు, బాలికలు లైంగిక వేధింపులకు గురికాకుండా చూడాలన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ శాంతలక్ష్మి, డీసీపీఓ మహేశ్,చి ల్డ్రన్ ఆఫ్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ కొండప్ప, మురళీధర్, వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయండి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్

పెనుకొండ: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల (బాలికల) పాఠశాలలో శనివారం బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ బి.ఎస్.స్వర్ణలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ పోక్సో చట్టంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. బాల్య వివాహాలు అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాన్నారు. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. బాలికలకు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. విద్యార్థినిలకు ఏ సమస్య ఉన్నా భయపడకూడదని, వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాసులు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపునకు చర్యలు



మడకశిరరూరల్: విజేతలకు బహుమతులు అందజేసిన దృశ్యం



అమరాపురం: వలసలో పూడికతీత పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

అమరాపురం/అగళి/మడకశిరరూరల్/రొళ్ల: నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. అమరాపురం మండలం వలస పంచాయతీలో ఉపాధి హామీ పథకం సిబ్బంది ఫారం పాండ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ జగదీష్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు. భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఏపీఓ శివన్న, ఈసీ శ్రీధర్ తెలిపారు. అగళి మండలంలోని పంచాయతీల్లో వర్షపు నీటిని నిల్వ చేయడానికి ఫారం పాండ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. మడకశిరం మండలం మెళవాయిలో జరిగిన కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మీనారాయణ, కార్యక్రమంలో సర్పంచ్ రంగనాథ్, ఏపీఓ శ్రీకాంత్‌గౌడ్, నాయకులు నారాయణ గౌడ్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు. చెరువులు, కుంటలతో పాటు చెక్‌డ్యాంలు, కట్టలు ఇతరాత్ర చోట పూడితతీత పనులు చేపట్టడం వల్ల భూగర్భ జల నీటి మట్టం పెరిగేందుకు అవకాశం ఉందని వక్కలిగ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ పాండురంగప్ప, ఎంపీడీఓ రామరావు పేర్కొన్నారు. రొళ్ల మండలం హులికుంట చెరువులో పూడికతీత పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఓ ఓబుళప్ప, జేఈ మారేగౌడ, కన్వీనర్ దాసిరెడ్డి, నాయకుడు నాగరాజు, పాల్గొన్నారు. జలమే జీవనాధారమని విద్యార్థులు నీటిని వృథా చేయకుండా కాపాడుకోవాలని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ ఇన్‌చార్జ్ డీన్ డాక్టర్ బి.హరిబాబు తెలిపారు. శనివారం వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ జలదినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వృకృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హైందవి, గోపీచంద్, ఐశ్వర్య, యశస్విని, బన్నీరెడ్డి, ఆదిత్య, రాజు, పురోహిత్, శ్రీభవ్య, హైందవి, శ్రీనివాస్‌రెడ్డికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఓ మురళీకృష్ణ, అధ్యాపకులు మోహన్‌రావు, సుమతి, కిశోర్, ప్రశాంతి, రాఘవేంద్ర, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరులో తాగునీటి సమస్య పరిష్కరిస్తాం



తాగునీటి సమస్యపై ఆరా తీస్తున్న అధికారులు

లేపాక్షి: కల్లూరు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని ఈఓఆర్డీ ఆనంద్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దివ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మప్ప పేర్కొన్నారు. శనివారం వారు ఎస్సీ, బీసీ కాలనీల్లో పర్యటించి నీటి సమస్యపై స్థానికులతో ఆరా తీశారు. మోటార్లు వేసిన వారికే నీరందుతోందని, మిగిలిన వారు ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు వారికి తెలియజేశారు. నీటి కోసం పనులు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కార్యదర్శి స్పందించి కొళాయిలకు మోటార్లు అమర్చి నీరు తోడిన వారిపై చర్యలు తీసుకుంటామని మైక్‌సెట్ ద్వారా హెచ్చరికలు జారీ చేశారు. గ్రామంలో ప్రతి ఇంటికీ నీరు అందేలా చర్యలు తీసుకుంటామని ఈఓఆర్డీ తెలిపారు. ఉగాది పండుగ అనంతరం మరో బోరు వేస్తామని ఏఈ స్థానికులకు హామీ ఇచ్చారు.

నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న దంత వైద్యులు

పావగడ: జిహ్వ చాపల్యంతో విభిన్న రుచులు కల్గించే నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చెడు పదార్థాలు తినకూడదని స్థానిక ప్రభుత్వాసుపత్రి పాలన వైద్యాధికారి ఏఎస్ఎల్ బాబు సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో విశ్వ నోరు పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. క్యాన్సర్ కారకాలైన పొగాకు, జర్దా, పాన్ పరాక్, ధూమ, మద్య పానం వంటి చెడు పదార్థాలు తినకూడదన్నారు. అలా తింటే క్యాన్సర్, గుండె జబ్బులు, పంటి నొప్పులు తదితర రోగాల బారిన పడి అర్థాంతరంగా తనువు చాలించాల్సి వస్తుందని హెచ్చరించారు. నోటిని శుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి రోగాలు రావని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్ కుమార్, దంత వైద్యురాలు సంధ్య, ఎన్‌డీసీ వైద్యురాలు శంరీన్ బాను తదితర ఎన్డీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మెగా డెయిరీ ఏర్పాటుకు కృషి



చెక్కులను చూపుతున్న పాల ఉత్పత్తి రైతులు

పావగడ: తుమకూరు జిల్లాలో మెగా పాల డెయిరీ ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. ఇందుకోసం రూ.100 కోట్లు అందించాలని సీఎం సిద్ధరామయ్యను కోరుతామని పావగడ ఎమ్మెల్యే హెచ్.వి వెంకటేశ్ తెలిపారు. తాలూకా సరిహద్దులోని మధుగిరిలో శనివారం పాల ఉత్పత్తి రైతులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాల విక్రయ నగదును పాల రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేసే ప్రక్రియను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. రైతుల నుంచి మెరుగైన పాలను సేకరించేలా చర్యలు చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు. పావగడ ప్రాంతంలో ప్రైవేట్ వ్యక్తుల బెడద తీవ్రంగా ఉందని.. ఆంధ్ర సరిహద్దుగా ఉండటంతో పావగడ రైతులు తమ పాలను ఆంధ్రలో ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. అలా చేస్తే కర్ణాటక సౌలభ్యాలను కోల్పోయే ప్రమాద ముందని హెచ్చరించారు. అనంతరం పాల ఉత్పత్తిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. నూతనంగా ఎన్నికైన తుముల్ అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్‌ను సన్మానించి అభినందించారు. అలాగే తుముల్ డైరెక్టర్ మధుగిరికి చెందిన నాగేశ్ బాబును సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మల్లికార్జునయ్య, రాజేంద్ర రాజణ్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు పరామర్శ

సోమందేపల్లి: మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్త చాకలి ఆనంద్ తల్లి అశ్వర్థమ్మ శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ అశోక్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు మంజు, వైస్ ఎంపీపీ వెంకట నారాయణరెడ్డి తదితరులు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

హిందూపురం అర్బన్: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నట్లు ఏఓ సురేంద్రనాయక్ తెలిపారు. ట్రాక్టర్ సంబంధిత పరికరాలు 23, పవర్ స్ప్రేయర్లు 17, పవర్ వీడర్-1, బ్యాటరీ స్ప్రేయర్లు 7 మంజూరయ్యాయన్నారు. పరికరాల కోసం అవసరమైన రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఏప్రిల్ 5న క్రికెట్ టోర్నీ

రొళ్ల: ఏప్రిల్ 5వ తేది నుంచి 7వ తేదీ వరకూ 'కుంచిటిగ క్రికెట్ లీగ్ సీజన్-2' రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు తాలూకా కుంచిటి వక్కలిగ సంఘం అధ్యక్షుడు బి.అనంతరాజు, సంఘం డైరెక్టర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరులోని ఎంఈఐ క్రీడా మైదానం బగలగుంటెలో ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

సంత్ సేవాలాల్ జయంతికి ఆహ్వానం

మడకశిర: పట్టణంలో త్వరలో జరగనున్న సంత్ సేవాలాల్ జయంతికి రావాలని ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామిని గిరిజన సంఘం నాయకులు ఆహ్వాన పత్రికలు అందించారు. శనివారం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో తహసీల్దార్లు, ఎంపీడీఓలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఇళ్ల స్థలాలు, పింఛన్లపై వేర్వేరుగా చర్చించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు నియామక పత్రాలు అందజేశారు.

సంక్షిప్త సమాచారం

వానరానికి అంత్యక్రియలు



సోమందేపల్లి: మండలంలోని కదిరేపల్లి గ్రామంలో మృతి చెందిన వానరానికి గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. శనివారం కుక్కలు దాడి చేయడంతో వానరం గాయపడి మృతి చెందింది. దీంతో ఆ వానరానికి గ్రామస్తులు పూజలు నిర్వహించి అంత్యక్రియలు చేపట్టారు.

ఎస్సీ వర్గీకరణ హర్షణీయం

హిందూపురం టౌన్: రాష్ట్ర అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై తీర్మానం చేయడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు.

పాఠశాల తనిఖీ

రొళ్ల: మండల పరిధిలోని పిల్లిగుండ్ల కన్నడ ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఈఓ శ్రీధర్ సందర్శించారు. పాఠశాలల్లో రికార్డులు పరిశీలించి, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో విద్యార్థులు అభ్యసించిన పాఠ్యాంశాలు, సామర్థ్యాలపై ఆరా తీశారు. మెనూ ప్రకారం రుచికరమైన మధ్యాహ్న భోజనం వడ్డించాలని సూచించారు.

ఏప్రిల్ 3న దుకాణాల వేలం

పావగడ: స్థానిక కొత్త బస్టాండ్‌లోని 22 వాణిజ్య దుకాణాలకు ఏప్రిల్ 3వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తామని మున్సిపల్ చైర్మన్ పీహెచ్ రాజేశ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బస్టాండ్‌లోని ఉత్తర, దక్షిణ దిక్కుల్లోని దుకాణాలతో పాటు షెల్టర్ కింద ఉన్న దుకాణాలను సైతం బహిరంగ వేలం వేస్తామన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉదయం 11 గంటలకు వేలం జరుగుతుందన్నారు. 12 ఏళ్ల కాలానికి లీజుకు ఇవ్వాలని తీర్మానించామన్నారు. ఇదిలా ఉండగా.. వేలం దరఖాస్తులు పొందడానికి, నమోదు చేయించుకునేందుకు ఈనెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ సమయం ఉంటుందన్నారు. అలాగే వేలం దరఖాస్తులను డీడీతో కలిపి ఏప్రిల్ 2వ తేదీ సాయంత్రంలోపు మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

సరుకులు సకాలంలో అందించండి

లేపాక్షి: కార్డుదారులకు సకాలంలో సరుకులు అందించాలని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి డీలర్లకు సూచించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ కార్డులో ఉన్న ప్రతి లబ్ధిదారుడితో ఈనెల 31లోపు ఈకేవైసీ చేయించాలని ఆదేశించారు.

పశువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

హిందూపురం: వేసవి సీజన్‌లో పాడి పశువుల సోకే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ షేక్ అబ్దుల్ రహీం పేర్కొన్నారు. బేవినాహళ్లి రైతు సేవ కేంద్రంలో శనివారం పాడి పశువులకు వేసవి కాలంలో వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. డాక్టర్ షేక్ అబ్దుల్ రహీం మాట్లాడుతూ వేసవి కాలంలో జెర్సీ హెచ్ఎఫ్ (సంకర జాతి పశువులు) ఆవుల్లో జ్వరం, శోషరస కణువుల పెరుగుదల, నీరసం, శ్వాసకోశ బాధ రక్తహీనత, బద్ధకం, ఆకలి మందగించడం, పునరుత్పత్తి తగ్గుదల, పాల దిగుబడి తగ్గుదల, ఎదకు రాకపోవడం, చూడి నిలవకపోవడం, శరీరంపై బాహ్యపరాన్న జీవులవంటివి పెరిగి వ్యాధి లక్షణాలు బయటపడే అవకాశాలు ఉంటాయన్నారు. పాడి రైతులు రోజుకు 3 పూటలుగా మేతను విభజించి, సమతుల ఆహారం, రోజుకు 60 లీటర్ల నీరు, చల్లని వాతావరణం, నీటి కుంటల్లో మునిగేటట్లు చూసుకోవాలన్నారు. నట్టల నివారణ మందు తాపించి వ్యాధి లక్షణాలను అరికట్టవచ్చని సూచించారు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	34.0
పెనుకొండ	36.0
మడకశిర	34.0

ఒంటిపూట బడి నిర్వహించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



ఎంఈఓ గంగప్పకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

హిందూపురం: ఒంటి పూట బడులు నిర్వహించని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఎంఈఓ గంగప్పకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నిచోట్ల ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా రెండుపూటలా పాఠశాలలు నిర్వహిస్తురన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు నరసింహమూర్తి, చంద్రశేఖర్, నందీష్, మహేష్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

మడకశిర: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్ కోరారు. శనివారం స్థానిక ఎస్వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడటం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, న్యాయవాదులు గోవర్దన్ రెడ్డి, గోవిందప్ప, సీఐ రాజ్‌కుమార్, లెక్చరర్ నాగరాజు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం పునరాలోచించాలి



మాట్లాడుతున్న మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఎం.ఎస్ మూర్తి

పెనుకొండ రూరల్: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఎం.ఎస్ మూర్తి కోరారు. శనివారం మాల మహానాడు కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారంగా కాకుండా ప్రస్తుత జనాభాను పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఆర్టికల్ 341 ప్రకారం పార్ల మెంట్‌లో చర్చ జరిపిన అనంతరం, సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శేషాద్రి, గోవిందు, నాగేంద్ర, గద్దం శ్రీనివాసులు, రామాంజనేయులు,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.